సాక్షి
జోగులాంబ గద్వాల

గురువారం । 21 । ఆగస్టు । 2025



అథ్లెట్లకు తిప్పలు

ఉమ్మడి పాలమూరు నుంచి పలు క్రీడల్లో రాణిస్తున్న క్రీడాకారులు అసౌకర్యాలతో అవస్థలు పడుతున్నారు.

-8లో ▸



జూరాలకు భారీ వరద

ఎగువన కురుస్తున్న భారీ వర్షాలతో ప్రియదర్శిని జూరాలకు 2.92 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుంది.

-8లో ▸

గరిష్టం/కనిష్టం
29.8 /22.6

వాతావరణం

రోజంతా ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఏటీసీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

గద్వాల: జిల్లాలోని అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్‌లో ప్రవేశాలకు సంబంధించి అర్హత గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ బీఎం సంతోష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిరుద్యోగ యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ఐటీఐలకు ఏఐ టెక్నాలజీ జోడించి ఏటీసీలుగా అప్‌గ్రేడ్ చేసినట్లు పేర్కొన్నారు. ఏటీసీలో ఒక సంవత్సరం కోర్సులు ఇంజినీరింగ్ డిజైన్ టెక్నీషియన్ (40 సీట్లు), ఇండస్ట్రీయల్ రోబోటిక్స్ అండ్ డిజిటల్ మ్యానుఫ్యాక్చరింగ్ టెక్నీషియన్ (40 సీట్లు), మ్యానుఫ్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ అండ్ ఆటోమేషన్ టెక్నీషియన్ (40 సీట్లు), రెండేళ్ల కోర్సులు వర్చువల్ అనాలిసిస్ అండ్ డిజైనర్ (24 సీట్లు), సీఎన్‌సీ మిషన్ టెక్నీషియన్ (24 సీట్లు), మెకానికల్ ఎలక్ట్రిక్ వెహికిల్ (24 సీట్లు) అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఏటీసీ సెంటర్ టాటా టెక్నాలజీస్ లిమిటెడ్ భాగస్వామ్యంతో కొనసాగుతుందన్నారు. కోర్సులు పూర్తిచేసుకున్న అభ్యర్థులకు ప్రైవేటు కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈ నెల 28వ తేదీలోగా https://iti.telangana.gov.in వెబ్‌సైట్‌లో లేదా నేరుగా దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. పూర్తి వివరాలకు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో సంప్రదించాలని తెలిపారు.

సీఎంఆర్ అప్పగించడంలో అలసత్వం వద్దు



గద్వాల: ప్రభుత్వం వద్ద మిల్లర్లు తీసుకున్న ధాన్యానికి సంబంధించిన సీఎంఆర్ అప్పగించడంలో అలసత్వం వహించొద్దని అదనపు కలెక్టర్ వి.లక్ష్మీనారాయణ అన్నారు. బుధవారం ఐడీఓసీ కార్యాలయంలోని తన చాంబర్‌లో సీఎంఆర్‌పై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి రైస్‌మిల్లులో నిల్వ ఉన్న ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లింగ్ చేసి.. సరఫరా చేయాలని మిల్లర్లను ఆదేశించారు. 2024–25 వానాకాలం ధాన్యానికి సంబంధించి సీఎంఆర్ గడువును సెప్టెంబర్ 12వ తేదీకి పొడిగించినట్లు తెలిపారు. జిల్లావ్యాప్తంగా ఉన్న 37 రైస్‌మిల్లుల్లో 65.366 టన్నులకుగాను ఇప్పటి వరకు 38,251 టన్నుల బియ్యాన్ని అందించినట్లు పేర్కొన్నారు. మిగతా బియ్యాన్ని కూడా గడువులోగా అప్పగించాలన్నారు. సన్నబియ్యాన్ని సమర్థవంతంగా సరఫరా చేయాలన్నారు. ప్రతి రైస్‌మిల్లులో నిల్వ ఉన్న ధాన్యాన్ని ఎప్పటికప్పుడు పరిశీలించాలని సంబంధిత అధికారులకు అదనపు కలెక్టర్ సూచించారు. సమావేశంలో డీఎస్‌ఓ స్వామికుమార్, డీఎం విమల ఉన్నారు.

ఉపాధి హామీ పథకంలో పనుల జాతర

గద్వాల: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల జాతర–2025లో భాగంగా ఈ నెల 22న జిల్లాలోని ప్రతి గ్రామపంచాయతీలో కొత్త పనులు ప్రారంభించనున్నట్లు అదనపు కలెక్టర్ నర్సింగ్‌రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉపాధి హామీ పథకం ద్వారా ప్రతి సంవత్సరం నిర్వహించే పనుల జాతర విజయవంతంగా కొనసాగుతోందన్నారు. పనుల జాతర–2024లో భాగంగా నవంబర్ 26న అన్ని జీపీల్లో భూ సంస్కరణ, పశువుల పాకాలు, నాడెప్ కంపోస్ట్ పిట్స్, ఫౌల్ట్రీ షెడ్స్, పొలం బాటలు, చెక్ డ్యాంలు, ఊటకుంటలు, బోర్‌వెల్స్ రీచార్జ్, పంచాయతీ, అంగన్‌వాడీ భవనాలు వంటి పనులకు శ్రీకారం చుట్టి.. రూ. 22.27కోట్లతో గత మార్చి 31వ తేదీ నాటికి మొత్తం 2,543 పనులు పూర్తిచేసినట్లు తెలిపారు. పనుల జాతర–2025లో మొత్తం 2,825 పనులను రూ. 18.85కోట్ల అంచనాతో ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు.

గుప్పుమంటున్న గంజాయి!

నడిగడ్డలో విచ్చలవిడిగా విక్రయాలు



- రోజువారీ కూలీ పనులు చేసుకునే యువతే లక్ష్యంగా దందా
- టీ పాయింట్లు, శివారు ప్రాంతాలే అడ్డా..
- తాజాగా పోలీసులకు చిక్కిన ముగ్గురు యువకులు
- మూడు నెలల్లోనే 2.330 కేజీల గంజాయి పట్టివేత

గద్వాల క్రైం: గంజాయి విక్రయాలకు నడిగడ్డ కేరాఫ్‌గా మారింది. రెండు రాష్ట్రాలకు సరిహద్దు ప్రాంతమైన నడిగడ్డకు గట్టుచప్పుడు కాకుండా గంజాయిని తీసుకొచ్చి విక్రయాలు సాగిస్తున్నారు. సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద పోలీసు, ఎక్సైజ్‌శాఖ అధికారులు నిత్యం తనిఖీలు చేపడుతున్నా.. జిల్లాలో విచ్చలవిడిగా గంజాయి విక్రయాలు జరగడం విస్మయానికి గురిచేస్తోంది. అయితే హైదరాబాద్‌లోని దూల్‌పేట, మహారాష్ట్రలోని షోలాపూర్, కర్ణాటక ప్రాంతాల్లో గంజాయి కొనుగోలుచేసి.. జిల్లాకేంద్రంలో విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా రోజువారీ పనులు చేసుకునే యువతను లక్ష్యంగా చేసుకొని గంజాయి దందా సాగిస్తున్నారు. తాజాగా ముగ్గురు యువకులు జిల్లా కేంద్రంలో గంజాయి విక్రయిస్తూ పోలీసులకు పట్టుబడ్డారు. మూడు నెలల వ్యవధిలోనే 2.330 కేజీల గంజాయిని పోలీసులు పట్టుకున్నారు.

గ్రాము రూ.500 చొప్పున విక్రయం..

జిల్లాలో యువత, కార్మికులను టార్గెట్ చేసుకొని గంజాయి విక్రయాలు సాగిస్తున్నారు. ముఖ్యంగా టీ పాయింట్లు, ఖాళీ ప్రదేశాలు, గ్రామ శివారు ప్రాంతాలను అడ్డాగా చేసుకొని గంజాయి దందా నిర్వహిస్తున్నారు. అయితే గంజాయికి అలవాటుపడిన వారిలో అధికంగా యువత ఉండటం.. అందులోనూ వివిధ పనులు చేస్తూ కార్మికులుగా జీవనం సాగిస్తున్న వారే ఉండటం విస్మయానికి గురిచేస్తోంది. ఒకప్పుడు ధనికులు మాత్రమే గంజాయి తీసుకుంటూ పోలీసులకు పట్టుబడిన సంఘటనలు వెలుగులోకి వచ్చేవి. ప్రస్తుతం రోజువారీగా కూలీ పనులు చేసుకునే వారు సైతం గంజాయి మత్తుకు బానిసలుగా మారుతున్నారు. మరోవైపు గంజాయి విక్రయిస్తూ పట్టుబడిన వారిలో యువతే ఉండటం అందరినీ ఆందోళనకు గురిచేస్తోంది. నడిగడ్డలో నిషేధిత మత్తు పదార్థాలకు బానిసగా మారిన యువకులు 100 మందికి పైగా ఉంటారని తెలుస్తోంది.



ఇటీవల పోలీసులకు పట్టుబడిన గంజాయి

నిఘా పెట్టాం..



గంజాయి సరఫరా, విక్రయాలపై ప్రత్యేక నిఘా పెట్టాం. జిల్లాకు చెందిన కొందరు యువకులు ఈ దందాలో ఉన్నట్టు తెలిసింది. గంజాయి ఎక్కడి నుంచి తీసుకొస్తున్నారు.. ఇందులో ఎంతమంది ఉన్నారనే విషయాలపై విచారణ కొనసాగుతోంది. యువత గంజాయికి దూరంగా ఉండాలి. గంజాయి అమ్మకాలు, వినియోగిస్తున్నట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలి. రెండు రాష్ట్రాల అధికారులతో మాట్లాడి గంజాయి అమ్మకాలపై స్పెషల్ డ్రైవ్ చేపట్టేందుకు చర్యలు తీసుకుంటాం. – శ్రీనివాసరావు, ఎస్పీ

ఇటీవల చోటుచేసుకున్న ఘటనలు..

- గద్వాల, అయిజకు చెందిన ముగ్గురు యువకులు ముఠాగా ఏర్పాడి గంజాయి విక్రయాలు చేస్తున్నట్లు తాజాగా వెలుగులోకి వచ్చింది. ఈ నెల 19న ఆ ముగ్గురు యువకులను పోలీసులు పట్టుకొని 1.65 కేజీల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.
- మే 21న గద్వాలకు చెందిన ఓ యువకుడు జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డులో గంజాయి విక్రయిస్తుండగా.. పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి 680 గ్రాముల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు.
- గతేడాది డిసెంబర్ 31న హైదరాబాద్‌కు చెందిన కొందరు యువకులు ఉండవెల్లి టోల్‌ప్లాజా వద్ద గంజాయి తాగుతూ పోలీసులకు పట్టుబడ్డారు. వారి నుంచి 18.30 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వీరంతా 20 ఏళ్లలోపు యువకులే ఉండటం గమనార్హం.

కూపీ లాగుతున్న పోలీసులు..

అటు ఆంధ్రప్రదేశ్, ఇటు కర్ణాటక రాష్ట్రాలకు నడిగడ్డ కేంద్రంగా ఉండటంతో నిషేధిత మత్తు పదార్థాల అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. మరోవైపు అయిజ, గట్టు, మల్దకల్, గద్వాల, శాంతినగర్, రాజోళి, ఉండవెల్లి, అలంపూర్ తదితర ప్రాంతాల్లో కొందరు వ్యవసాయ పొలాల్లో గంజాయిని గుట్టుగా సాగుచేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో పోలీసు, ఎక్సైజ్‌శాఖ అధికారులు నిత్యం తనిఖీలు చేపట్టడంతో పాటు వ్యవసాయ పొలాల్లో గంజాయి సాగుచేసిన వారిపై కేసులు నమోదు చేసిన సంఘటనలు సైతం ఉన్నాయి. అయితే పాత కేసుల్లో పట్టుబడిన వారు ప్రస్తుతం ఎక్కడ ఉన్నారు.. ఏం చేస్తున్నారనే కోణంలో పోలీసులు కూపీ లాగుతున్నారు. ఏదేమైనప్పటికీ నడిగడ్డలో నిషేధిత మత్తు పదార్థాలపై అధికారులు ఉక్కుపాదం మోపి.. యువతను సన్మార్గంలో నడిపించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఎరువుల కొరత ఉండొద్దు



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ బీఎం సంతోష్

- కలెక్టర్ బీఎం సంతోష్

గద్వాల: రైతులకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉండాలని.. ఎట్టి పరిస్థితుల్లోనూ కొరత ఉండొద్దని కలెక్టర్ బీఎం సంతోష్ ఆదేశించారు. బుధవారం ఐడీఓసీలోని కాన్ఫరెన్స్ హాల్‌లో సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం జిల్లాలో 543 మెట్రిక్ టన్నుల యూరియాను అవసరమున్న రైతులకు మాత్రమే పంపిణీ చేయాలన్నారు. యూరియా పంపిణీలో అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లాకు వచ్చే యూరియాను పూర్తిగా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారానే రైతులకు అందజేయాలని.. ఇతర ఆగ్రో షాపులకు కేటాయించరాదన్నారు. గతేడాది కంటే ఈ సారి 600 మెట్రిక్ టన్నుల యూరియాను ఎక్కువగా విక్రయించడం జరిగిందని, అయినప్పటికీ యూరియా కొరతకు గల కారణాలపై సమగ్ర విచారణ జరపాలని కలెక్టర్ ఆదేశించారు. ఎరువులు పక్కదారి పట్టకుండా పర్యవేక్షణ చేయాలన్నారు. అదే విధంగా రైతులు కూడా తమకు అవసరమైనంత మేరకే ఎరువులు వినియోగించుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. ఒకసారి తీసుకున్న రైతులకు మళ్లీ ఇవ్వకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో డీఏఓ సక్రియా నాయక్, ఏడీఏ సంగీతలక్ష్మి తదితరులు ఉన్నారు.

‘ఆత్మీయ భరోసా’ అమలులో విఫలం



అలంపూర్: ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం అమలులో ప్రభుత్వం విఫలమైందని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రాజు విమర్శించారు. అలంపూర్‌లోని కేవీపీఎస్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జీఓ 42 ప్రకారం ఉపాధి హామీ పథకం కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం ద్వారా ఆర్థిక చేయూత అందించాల్సి ఉండగా.. పథకం అమలులో తీవ్ర జాప్యం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో 5లక్షల మంది లబ్ధిదారులను ఎంపికచేసి.. కేవలం 83వేల మందికి రూ. 50.33కోట్లు చెల్లించారని తెలిపారు. మిగిలిన 4,13,658 మందికి రూ. 250కోట్లు చెల్లించాల్సి ఉండగా.. ప్రస్తుతం మరో 2లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. ప్రభుత్వం మాత్రం లబ్ధిదారుల ఖాతాల్లో నిధులు జమ చేయడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం లబ్ధిదారులకు ఆత్మీయ భరోసా అందించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రాఘవేంద్ర యాదవ్, నర్సింహ ఉన్నారు.

యూరియా కోసం రోడ్డెక్కిన రైతులు

- జిల్లా కేంద్రంలో గంట పాటు ఆందోళన
- ఎమ్మెల్యే చొరవతో 22 మెట్రిక్ టన్నుల యూరియా పంపిణీ



జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో రాస్తారోకో నిర్వహిస్తున్న రైతులు

గద్వాలన్యూటౌన్: జిల్లాలో యూరియా సమస్య తీరడం లేదు. వారం రోజులుగా యూరియా కోసం రైతులు నానా అవస్థలు పడుతున్నారు. పీఏసీఎస్‌ల వద్ద గంటల తరబడి క్యూ కడుతున్నారు. అయినప్పటికీ యూరియా లభించకపోవడంతో రోడ్డెక్కి ఆందోళనకు దిగుతున్నారు. మంగళవారం అయిజ, గట్టు, కేటీదొడ్డి మండలాల్లో రైతులు ఆందోళనకు దిగగా.. తాజాగా జిల్లా కేంద్రంలో రైతులు రోడ్డెక్కారు. బుధవారం స్థానిక పీఏసీఎస్ కార్యాలయానికి రైతులు యూరియా కోసం వచ్చారు. అయితే స్టాక్ లేదని అధికారులు చెప్పడంతో ఆగ్రహించిన అన్నదాతలు.. అంబేడ్కర్ చౌరస్తా వద్ద రాస్తారోకో చేపట్టారు. యూరియా కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని.. రోజుల తరబడి ఎదురుచూడాల్సి వస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. యూరియా చల్లకపోవడం వల్ల మొక్కల పెరుగుదల మందగించి.. దిగుబడులు తగ్గే ప్రమాదం ఉందని వాపోయారు. రైతులకు బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి బాసు హనుమంతు నాయుడు, ఇతర నాయకులు సంఘీభావం తెలిపారు. గంట పాటు రైతులు చేపట్టిన ఆందోళనతో వాహనాల రాకపోకలు స్తంభించాయి. విషయం తెలుసుకున్న డీఎస్పీ మొగిలయ్య పోలీసులతో అక్కడికి చేరుకొని రైతులను శాంతింపజేశారు.

22 మెట్రిక్ టన్నుల యూరియా పంపిణీ..

రైతుల ఆందోళన విషయం తెలుసుకున్న పీఏసీఎస్ చైర్మన్ సుభాన్ అక్కడికి చేరుకొని విషయాన్ని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే కలెక్టర్‌తో మాట్లాడి రైతుల సమస్యను వివరించడంతో 22 మెట్రిక్ టన్నుల యూరియాను గోదాముకు పంపించారు. దీంతో పీఏసీఎస్ అధికారులు రైతులకు టోకెన్లు అందించి.. యూరియా పంపిణీ చేశారు.



రైతులకు టోకెన్ల పంపిణీ విధానాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు

- పీఏసీఎస్ కార్యాలయాన్ని ఎస్పీ శ్రీనివాసరావు సందర్శించి రైతులకు టోకెన్ల పంపిణీ విధానాన్ని పరిశీలించారు. నిల్వ ఉన్న యూరియాను నిబంధనలకు అనుగుణంగా పంపిణీ చేయాలని అధికారులకు సూచించారు. ఎరువుల కృత్రిమ కొరత తలెత్తకుండా జాగ్రత్త వహించాలన్నారు. ఎస్పీ వెంట డీఎస్పీ మొగిలయ్య, పట్టణ ఎస్‌ఐ కళ్యాణ్‌కుమార్, వ్యవసాయశాఖ అధికారులు ఉన్నారు.

‘యమ’డేంజర్..!

ప్రమాదకరంగా ఆర్‌యూబీలు

- భారీ వర్షాలతో అండర్ పాస్‌లకు పోటెత్తుతున్న వరద
- పలు గ్రామాలు, కాలనీలకు నిలిచిపోయిన రాకపోకలు
- ప్రతి ఏటా ఇదే తంతు.. తాత్కాలిక చర్యలతోనే సరి
- ప్రత్యేక పైపులైన్ల ఏర్పాటును పట్టించుకోని రైల్వే శాఖ
- డ్రైయినేజీల విస్తరణ, అనుసంధానంపై నిర్లక్ష్యం



2022 జూలై 08: ఇది మహబూబ్‌నగర్ రూరల్ మండలం సూగురుగడ్డ రైల్వే అండర్ బ్రిడ్జిలో భారీగా చేరిన వరద నీటిలో చిక్కుకున్న ఓ స్కూల్ బస్సు. ఆ సమయంలో 30 మంది విద్యార్థులు బస్సులో ఉండగా.. యువకుల సమయస్ఫూర్తితో ప్రాణాపాయం తప్పింది.



2025 ఆగస్ట్ 14: ఇది మహబూబ్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి బండమీదపల్లి (పాలిటెక్నిక్ కళాశాలకు వెళ్లే దారి)లోని రైల్వే అండర్ బ్రిడ్జి. భారీ వర్షంతో వరద పోటెత్తగా చెరువును తలపిస్తోంది. ఐదు రోజులుగా అటు ఇటుగా రాకపోకలు నిలిచిపోయాయి.

...ప్రమాదాల నివారణే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం రైల్వే గేట్ల వద్ద నిర్మించిన రైల్వే అండర్ బ్రిడ్జిలు డేంజరస్‌గా మారాయనేందుకు ఇవి ఉదాహరణలు మాత్రమే. ఆర్‌యూబీల నిర్మాణాల్లో జాగ్రత్తలు తీసుకోకపోవడమే ఈ దుస్థితికి కారణం కాగా.. ప్రతి వర్షాకాలం సీజన్‌లో పోటెత్తుతున్న వరదతో రాకపోకలు నిలిచిపోతున్నాయి. ప్రమాదాలు పొంచి ఉండడంతో సమీప ప్రాంతాల ప్రజలు బిక్కుబిక్కుమని జీవనం గడుపుతున్నారు. ఉమ్మడి జిల్లాలో ప్రమాదకరంగా మారిన అండర్ పాస్‌లు, ఇబ్బందులు ఎదుర్కొంటున్న గ్రామాలపై ‘సాక్షి’ ఫోకస్..

– సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్

సాక్షి ఫోకస్



గద్వాల జిల్లా నారాయణపురం వద్ద అండర్ రైల్వేబ్రిడ్జిలో నిలిచిన వర్షపునీరు



హైవే నుంచి బ్రిడ్జి గోడపై నడుచుకుంటూ వస్తున్న జనం

ప్రతి ఏటా ఇబ్బందులే..

- మహబూబ్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అప్పనపల్లి, దివిటిపల్లి, న్యూమోతీనగర్, ఏనుగొండ, బండమీదపల్లి (పాలిటెక్నిక్ కళాశాల దారి), మన్యంకొండ స్టేషన్ దగ్గర సూగురుగడ్డ ఆర్‌యూబీల్లో వరద నీరు పారడం నిత్యకృత్యంగా మారింది. ప్రతి ఏటా పలు కాలనీలు, గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతున్నా.. అధికారులు శాశ్వత చర్యల దిశగా అడుగులు వేయకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.
- దేవరకద్రలోని దళితవాడ వద్ద ఆర్‌యూబీ గుండా రైతులు రాకపోకలు కొనసాగిస్తుంటారు. భారీ వర్షం వస్తే అండర్ పాస్‌లో మోకాళ్ల లోతులో నీళ్లు నిలుస్తున్నాయి. వ్యవసాయ పనులకు ఆటంకాలు ఎదురవుతుండడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు.
- జడ్చర్ల నుంచి ఆలూరు గ్రామానికి వెళ్లే దారిలో ఉన్న ఆర్‌యూబీలో నీళ్లు నిలుస్తుండడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. ప్రస్తుతం నీరు సాఫీగా వెళ్లేందుకు పైపులైన్ వేసే పనులు కొనసాగుతున్నాయి.

ఇంకా ఎక్కడెక్కడ.. ఎలా అంటే..

- దేవరకద్ర మండల పరిధిలోని వెంకటాయపల్లి, కౌకుంట్లలో ఏర్పాటు చేసిన ఆర్‌యూబీల్లో రెండు వైపులా రెండు కన్నాలు చేసి ఇనుపజాలి పెట్టారు. లోపలికి వచ్చే వరద నీరు వాటి గుండా బయటకు పైపులైన్ ద్వారా గుంతలో చేరుతున్నాయి. అది నిండితే మళ్లీ అండర్ పాస్‌లకే చేరుతున్నాయి. దీంతో పైపులైన్‌ను నేరుగా చెరువుకు మళ్లించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నా.. ఎవరూ పట్టించుకోవడం లేదు.
- డోకూర్ వద్ద చేపటిన అండర్ బ్రిడ్జి నిర్మాణం తుదిదశలో ఉంది. వర్షం వస్తే వరద నీరు వెళ్లేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేయకపోవడంతో ఇటీవల నీటమునిగింది. ఫలితంగా దేవరకద్ర నుంచి జినుగురాల, డోకూర్ గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో గ్రామస్తులు ఇటీవల అండర్ బ్రిడ్జి వద్ద ఆందోళన చేపట్టడంతో పాటు కాంట్రాక్టర్‌ను నిలదీశారు.
- వనపర్తి జిల్లా మదనాపురం మండలంలోని నెలివిడి గేట్, నర్సింగాపూర్ వద్ద ఉన్న ఆర్‌యూబీల్లో వరద నీరు సాఫీగా వెళ్లేలా ఎలాంటి ఏర్పాట్లు చేయలేదు. కొన్నూర్ ఆర్‌యూబీ వద్ద నీళ్లు మళ్లించేలా పైపులైన్ వేసినా ఫలితం లేదని, వరద వచ్చినప్పుడు నీళ్లు నిలుస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు.
- జోగుళాంబ గద్వాల జిల్లా మానవపాడు మండలం నారాయణపురం వద్ద ఉన్న ఆర్‌యూబీలో నీరు సాఫీగా వెళ్లేందుకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ప్రస్తుతం ఒక మోటారు సాయంతో నీటిని ఎత్తిపోస్తున్నారు.

తాత్కాలిక చర్యలతోనే సరి..

ఆర్‌యూబీలు వరద నీటిలో చిక్కుకున్నప్పుడు మాత్రమే అధికారులు స్పందిస్తున్నారు. అప్పటికప్పుడు మోటార్ల ద్వారా నీరు ఎత్తిపోసేలా చర్యలు తీసుకుంటున్నారు తప్ప.. సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించడం లేదు. ప్రధానంగా ప్రత్యేక పైపులైన్లు ఏర్పాటు చేసి.. డ్రెయినేజీలు విస్తరించి, అనుసంధానించడంలో రైల్వేశాఖ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. పలు చోట్ల అండర్ పాస్‌ల వద్ద సరైన లైటింగ్ సౌకర్యం ఏర్పాటు చేయకపోవడంతో రాత్రి వేళ వాహనదారులు వరద నీటిలో చిక్కుకున్న ఘటనలు ఉన్నాయి. అయినా అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

బెంబేలెత్తిస్తున్న నాసిరకం పనులు..

ఇటీవల కురిసిన భారీ వర్షంతో వరద పోటెత్తగా అప్పనపల్లి, బండమీదపల్లి ఆర్‌యూబీల్లో రిటైనింగ్ వాల్స్ కూలాయి. ఈ నేపథ్యంలో అండర్ బ్రిడ్జిల నిర్మాణాల్లో నాసిరకం పనులు చోటుచేసుకున్నాయనే అనుమానాలు వ్యక్తమవుతుండగా.. ప్రజలు బెంబేలెత్తుతున్నారు. ఈ క్రమంలో రైల్వే శాఖ అధికారులను సంప్రదించగా.. ‘పెద్ద ఎత్తున వరద రావడంతోనే రిటైనింగ్ గోడలు నేలకూలాయి. గతంలో నిర్మించిన వాటిలో కొన్నింటికి పైపులైన్ల వ్యవస్థ లేదు. ప్రస్తుతం నిర్మిస్తున్న ఆర్‌యూబీల వద్ద నీరు సాఫీగా వెళ్లేలా ఏర్పాట్లు చేస్తున్నాం. నీరు నిలిచిన ఆర్‌యూబీల్లో కార్పొరేషన్, మున్సిపాలిటీ, గ్రామ పంచాయతీ అధికారులతో కలిసి పంపింగ్ చేసేలా చర్యలు తీసుకున్నాం.’ అని తెలిపారు.

పట్టాలపైనే నడవాల్సి వస్తోంది..



గ్రామం నుంచి 4 కిలోమీటర్ల దూరంలో ఉన్న జాతీయ రహదారికి నారాయణపురం వద్ద ఉన్న అండర్‌రైల్వే బ్రిడ్జి కింది నుంచే వెళ్లాలి. వర్షం వస్తే ఇక్కడ ఐదు అడుగుల మేర నీరు చేరుతుండడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు అవుతుంది. తప్పనిసరి పరిస్థితుల్లో రైల్వే పట్టాలపై నడుచుకుంటూ ప్రయాణం సాగించాల్సి వస్తోంది.

– లింగేశ్వర, నారాయణపురం, మానవపాడు మండలం

అత్యవసర సమయాల్లో అవస్థలు



ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో పది రోజుల నుంచి హనుమాన్‌పురాలోని ఆర్‌యూబీ ద్వారా రాకపోకలు బంద్ అయ్యాయి. రైల్వే ట్రాక్ అవతల 2.5 కి.మీ. దూరంలో మా తండా ఉంటుంది. ప్రతి రోజూ బైక్‌ను ఇవతల ఉంచి న్యూటౌన్‌లో నేను పనిచేసే ప్రైవేట్ ఆస్పత్రికి వస్తున్నాను. తిరిగి రాత్రి రైల్వే ట్రాక్ వద్ద నిలిపి అవతలికి కాలినడకన వెళ్లి ఆ తర్వాత ఏదైనా ఆటో అందుబాటులో ఉంటే తండాకు చేరుకుంటున్నాను. అత్యవసర సమయాల్లో ఎన్నో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పాత గేటును వెంటనే తెరిస్తే సమస్య కొంత వరకు పరిష్కారమవుతుంది.

– పి.మహేష్, ప్రైవేట్ ఉద్యోగి, గొల్లబండతండా

క్లుప్తంగా

స్కూల్ బస్సు ప్రమాదంపై విచారణ

ఇటిక్యాల: ఇంటిముందు ఆడుకుటుంన్న విద్యార్థిని స్కూల్ బస్సు ఢీకొట్టడంతో మృతి చెందిన సంఘటనపై బుధవారం మండలంలోని శనగపల్లిలో పోలీసులు విచారణ చేపట్టారు. బాధితుల వివరాల ప్రకారం.. మండలంలోని శనగపల్లికి చెందిన రోహిత్‌కుమార్(4) మంగళవారం సాయంత్రం ఇంటి ముందు ఆడుకుంటుండగా ప్రైవేట్ పాఠశాలకు చెందిన బస్సు డ్రైవర్ సునీల్ అతివేగం వల్ల ఢీకొట్టడంతో బాలుడు మృతి చెందిన విషయం తెలిసిందే. ఘటనకు సంబంధించి తండ్రి వెంకటేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవినాయక్ తెలిపారు.

పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్యాయత్నం

మల్దకల్: పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన మండల కేంద్రంలో బుధవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. మండల కేంద్రానికి చెందిన నర్సింహులు కొంత కాలంగా ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాడు. ఈ క్రమంలో తెల్లవారు జామున ఇంట్లో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం గద్వాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం వైద్యులు కర్నూలు ఆస్పత్రికి రెఫర్ చేసినట్లు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

భూత్పూర్: మండలంలోని పోతులమడుగు శివారులోని జాతీయ రహదారిపై బుధవారం రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం చెందాడు. ఎస్ఐ చంద్రశేఖర్ కథనం ప్రకారం.. తిమ్మాజిపేట మండలం గుమ్మకొండ గ్రామానికి చెందిన బి. భాస్కర్ (26) ద్విచక్ర వాహనంపై జడ్చర్ల నుంచి అత్తగారి గ్రామం తాటికొండకు బోనాల పండుగ కోసం వెళ్తున్నాడు. మార్గమధ్యంలో పోతులమడుగు శివారులో బైక్ అదుపు తప్పి కిందపడడంతో తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. అతడి తల్లి నాగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

యువకుడి మృతితో విషాదఛాయలు

తిమ్మాజిపేట: మండలంలోని గుమ్మకొండకు చెందిన బైరపాగ భాస్కర్ (26) మంగళవారం రాత్రి పోతులమడుగు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతదేహాన్ని బుధవారం గుమ్మకొండకు తీసుకొచ్చి ఖననం చేశారు. భార్య పల్లవి గర్భిణి కావడం, భాస్కర్ అకాల మరణం చెందడంతో కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలు మిన్నంటాయి.

కాలుజారి పడి వ్యక్తి మృతి

రాజాపూర్: ప్రమాదవశాత్తు కిందపడి గాయాలపాలైన వ్యక్తి మృతి చెందిన ఘటన మంగళవారం రాత్రి ఖానాపూర్‌లో చోటు చేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజాపూర్ మండలం ఖానాపూర్ గ్రామానికి చెందిన కుమ్మరి మల్లేష్ (43) మంగళవారం రాత్రి భోజనం చేసిన అనంతరం మూత్ర విసర్జన కోసం ఇంటి బయటికి వెళ్లాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు కాలు జారి కిందపడడంతో తలతో పాటు వెనక భాగాన బలమైన గాయాలయ్యాయి. దీంతో క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో జడ్చర్ల ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా డాక్టర్ పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. దీంతో మృతుడి భార్య వెంకటమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివానందం తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఆత్మకూర్: మండలంలోని తూంపల్లి గ్రామానికి చెందిన రాజయ్య (70) పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. ఎస్ఐ నరేందర్ వివరాల ప్రకారం.. రాజయ్య కొన్నేళ్లుగా పక్షవాతంతో బాధపడుతున్నాడు. జీవితంపై విరక్తి చెంది మంగళవారం ఉదయం ఇంట్లో పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈవిషయాన్ని గమనించిన కుటుంబ సభ్యులు రాజయ్యను ఆత్మకూర్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్ ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అర్ధరాత్రి మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రూ.3.62 లక్షలు మాయం

మహబూబ్‌నగర్ క్రైం: స్మార్ట్‌ఫోన్‌లకు లింక్‌లు పంపించి ఇద్దరు వ్యక్తుల ఖాతాల్లో నుంచి భారీ మొత్తంలో సైబర్ నేరగాళ్లు డబ్బులు మాయం చేశారు. టూటౌన్ సీఐ ఇజాజుద్దీన్ కథనం ప్రకారం.. జిల్లాకేంద్రంలోని కొత్తగంజ్‌కు చెందిన శ్రీనివాసులు వాట్సాప్ లింక్ పంపించి గ్రూప్‌లో జాయిన్ చేశారు. అతనికి మూడు టాస్క్‌లు ఇచ్చి పూర్తి చేయించగా నాలుగో టాస్క్‌లో నువ్వు తప్పు చేశావని అతని భయపెట్టి ఆ తప్పును సరిదిద్దుకోవాలంటే కొంత నగదు చెల్లించాలని చెప్పారు. దీంతో సైబర్ నేరగాళ్లను శ్రీనివాసులును నమ్మించి అతని నుంచి దశల వారిగా రూ.2.98 లక్షలు మాయం చేశారు. అలాగే మరో ఘటనలో కానిస్టేబుల్ సురేష్‌కు లింక్ పంపించి దానిని క్లిక్ చేయడంతో అతని ఖాతాలో నుంచి రూ.63 వేల నగదు మాయమైంది. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెల్లడించారు.

అథ్లెట్లకు తిప్పలు..

ఉమ్మడి జిల్లాలో అందుబాటులో లేని సింథటిక్ ట్రాక్‌లు



మహబూబ్‌నగర్ మెయిన్ స్టేడియంలో మట్టి ట్రాక్‌పై ప్రాక్టీస్ చేస్తున్న అథ్లెట్లు (ఫైల్)

- ఐదు జిల్లాల్లో వందలాది మంది అథ్లెట్లు
- ఉమ్మడి జిల్లాలో ఎక్కడా ఊసే లేదు
- మెరుగైన క్రీడా శిక్షణకు ఇబ్బందులు
- ట్రాక్‌లు ఏర్పాటు చేయాలంటున్న క్రీడాకారులు

మహబూబ్‌నగర్ క్రీడలు: ఉమ్మడి పాలమూరు జిల్లా క్రీడల్లో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. జిల్లా నుంచి పలు క్రీడల్లో క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించారు. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో ఐదు చోట్ల ఖేలో ఇండియా సెంటర్లు, మహబూబ్‌నగర్‌లో వాలీబాల్ అకాడమీ, వనపర్తి పట్టణంలో హాకీ అకాడమీ ఉంది. ఉమ్మడి జిల్లాకు చెందిన క్రీడాకారులు అథ్లెటిక్స్‌లో పతకాలు సాధిస్తూ సత్తాచాటుతున్నారు. కానీ ఈ జిల్లాల్లో సింథటిక్ అథ్లెటిక్స్ ట్రాక్‌లు లేకపోవడంతో చాలా మంది క్రీడాకారులు మట్టి గ్రౌండ్‌లోనే సాధన చేస్తున్నారు.

ఔత్సాహిక క్రీడాకారులకు వరం

సింథటిక్ ట్రాక్‌లు ఏర్పాటు అయితే ఔత్సాహిక క్రీడాకారులకు ఎన్నో మెరుగైన సౌకర్యాలు లభిస్తాయి. పరుగు పందెం పోటీల్లో క్రీడాకారుల్లో సరైన టైమింగ్ వచ్చే అవకాశం ఉంటుంది. ట్రాక్‌లపై నీళ్ల నిలిచే అవకాశం ఉండదు కాబట్టి వర్షాకాలంలో సైతం ఏ ఇబ్బంది లేకుండా అథ్లెట్లు సాధన చేసుకోవచ్చు. సింథటిక్ అథ్లెటిక్స్ ట్రాక్‌ల ఏర్పాటుతో జాతీయ, అంతర్జాతీయ టోర్నీలు జరిగే అవకాశం ఉంటుంది.

స్టేడియం పరిశీలించిన కేంద్ర సభ్యులు

జిల్లా కేంద్రంలోని మెయిన్ స్టేడియంలో 400 మీటర్ల 8 లైన్ల సింథటిక్ ట్రాక్ ప్రతిపాదనలకు సంబంధించి 2021 అక్టోబర్ 22న ఖేలో ఇండియా కేంద్ర పరిశీలన కమిటీ సభ్యులు పరిశీలించారు. స్టేడియం అంతా తిరిగి సింథటిక్ ట్రాక్ ఏర్పాటుకు సంబంధించి సాధ్యాసాధ్యాలపై అంచనా వేశారు. అదే విధంగా మెయిన్ స్టేడియంలో 2023 సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వం పలు అభివృద్ధి పనులతో పాటు రూ.8కోట్ల నిధులతో చేపట్టనున్న సింథటిక్ అథ్లెటిక్స్ ట్రాక్ ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. అయితే ఇంత వరకు సింథటిక్ ట్రాక్ ఏర్పాటుపై ముందడుగు పడలేదు. దీంతో స్టేడియంలో ఉన్న మట్టి ట్రాక్‌పై అథ్లెట్లు ప్రాక్టీస్ చేస్తున్నారు.

సింథటిక్ ట్రాక్ ఏర్పాటు చేయాలి



మెయిన్ స్టేడియంలో ఇప్పటికే అనేక క్రీడా సౌకర్యాలు ఉన్నాయి. సింథటిక్ అథ్లెటిక్స్ ట్రాక్ ఏర్పాటు చేస్తే క్రీడాకారులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. సింథటిక్ ట్రాక్‌పై క్రీడాకారులు ప్రాక్టీస్ చేస్తే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మెరుగైన ఫలితాలు సాధించే అవకాశం ఉంటుంది.

– జి.శరత్‌చంద్ర, అథ్లెటిక్స్ సంఘం కార్యదర్శి, మహబూబ్‌నగర్

ప్రతిపాదనలు పంపాం



జిల్లా కేంద్రంలోని మెయిన్ స్టేడియంలో సింథటిక్ అథ్లెటిక్స్ ట్రాక్ కోసం రూ.10 కోట్లతో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణకు ప్రతిపాదనలు పంపాం. త్వరలో ట్రాక్ ఏర్పాటుకు సంబంధించి ఉత్తర్వులు వచ్చే అవకాశం ఉంది. సింథటిక్ ట్రాక్‌లో అంతర్జాతీయ స్థాయిలో సౌకర్యాలు ఉంటాయి.

– ఎస్.శ్రీనివాస్, డీవైఎస్ఓ, మహబూబ్‌నగర్

క్రీడాకారులకు మేలు



సింథటిక్ అథ్లెటిక్స్ ట్రాక్ ఏర్పాటు వల్ల క్రీడాకారులకు మెరుగైన ప్రాక్టీస్ లభిస్తుంది. దీంతో జిల్లా క్రీడాకారులను జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దొచ్చు. సింథటిక్ ట్రాక్ కోసం జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి దృష్టికి తీసుకెళ్తాం.

– రమణ, జిల్లా అథ్లెటిక్స్ సంఘం కార్యదర్శి, నారాయణపేట

త్వరలో సీఎంను కలిపిస్తాం

- భూ నిర్వాసితులకు న్యాయం చేయిస్తాం
- భరోసానిచ్చిన మంత్రులు



జిల్లా ఇన్‌చార్జి మంత్రి దామోదర రాజనర్సింహ, మంత్రి వాకిటి శ్రీహరికి హైదరాబాద్‌లో వినతిపత్రాన్ని ఇస్తున్న భూ నిర్వాసితులు


నారాయణపేట: నారాయణపేట– కొడంగల్ ఎత్తిపోతల పథకం కింద భూములు కోల్పోతున్న భూ నిర్వాసితులకు న్యాయం చేయించేందుకు త్వరలో సీఎం రేవంత్‌రెడ్డిని కలిపిస్తామని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి దామోదర్ రాజనర్సింహ, జిల్లా మంత్రి వాకిటి శ్రీహరి భూ నిర్వాసితులకు భరోసా ఇచ్చారు. మంగళవారం రాత్రి మంత్రి వాకిటి శ్రీహరి, డీసీసీ మాజీ అధ్యక్షుడు కుంభం శివకుమార్‌రెడ్డి చొరవతో మంత్రి దామోదర రాజనరసింహాను నారాయణపేట, మక్తల్ నియోజకవర్గంలోని భూ నిర్వాసితుల సంఘం సభ్యులు, అఖిలపక్షం నాయకులు, భూ నిర్వాసితులు కలిసి తమ గోడును వినిపించారు. భూ నిర్వాసితులకు బేసిక్ ధరను 2013 భూ చట్టాన్ని, ప్రస్తుత మార్కెట్ ధరను పట్టించుకోకపోవడంతో భూ నిర్వాసితులకు తీవ్ర నష్టం కలుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎకరానికి రూ.2.25 లక్షలు ప్రభుత్వ మార్కెట్ ధర ఉండంటూ కేవలం రూ.14 లక్షలు చెల్లిస్తుండడంతో తీవ్ర అన్యాయం జరుగుతోందని వాపోయారు. కానీ మార్కెట్ ధర రూ.50 లక్షల నుంచి రూ.60 లక్షలు పలుకుతుందన్నారు. కాస్తుకు, రికార్డు మధ్య పొరపాటు ఉందని వాటిని సరి చేయాలని, ఇంటికో ఉద్యోగం, పింఛన్ సౌకర్యం, ఇందిరమ్మ ఇల్లు, ప్రభుత్వ పథకాల్లో అవకాశం కల్పించాలని భూనిర్వాసితులు మంత్రులను కోరారు. తాము ప్రాజెక్టు నిర్మాణానికి వ్యతిరేకం కాదని.. భూ పరిహారాన్ని రూ.35 లక్షలు పెంచి ఇవ్వాలనేదే తమ కోరిక.. డిమాండ్ అని తెలిపారు. అనంతరం మంత్రులు స్పందిస్తూ త్వరలోనే సీఎంతో మాట్లాడించి భూ నిర్వాసితులకు తగు న్యాయం చేసేందుకు కృషి చేస్తామన్నారు. మంత్రులను కలిసిన వారిలో భూ నిర్వాసితుల సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు జి వెంకట్రాంరెడ్డి, అధ్యక్షుడు మశ్చందర్, రైతు సంఘం నాయకులు వెంకోబ, సీఐటీయూ జిల్లా కార్యదర్శి బాల్‌రామ్, భూ నిర్వాసితులు గోపాల్ రెడ్డి, రమేశ్‌శెట్టి, బీజేపీ నాయకుడు భాస్కర్ తదితరులు ఉన్నారు.

కలెక్టర్, ఎస్పీలకు ఎస్సీ కమిషన్ నోటీసులు

రాజాపూర్: దళితుల భూమిని కబ్జా చేసిన వ్యవహారంలో రాజాపూర్ పోలీసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ నిరోధక చట్టం ప్రకారం కేసు ఎందుకు నమోదు చేయలేదో చెప్పాలని మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్, ఎస్పీలను జాతీయ ఎస్సీ కమిషన్ ఆదేశించింది. రాజాపూర్ మండలం తిరుమలాపూర్ గ్రామంలోని సర్వే నంబర్ 131ఏ కి సంబంధించిన కబ్జా వ్యవహారంలో తాత్సారంపై కమిషన్ నోటీసులు జారీ చేసింది. 30 రోజుల్లోగా సమాధానం ఇవ్వాలని అందులో స్పష్టం చేసింది.

మీ కొడుకు డ్రగ్ కేసులో దొరికాడు

- రూ.30 వేలు ఫోన్‌పే చేస్తే వదిలేస్తాం
- సైబర్ నేరగాళ్ల బెదిరింపులు



నాగేందర్‌కు వచ్చిన వాట్సప్ ఫోన్ కాల్ వివరాలు



సైబర్ నేరస్థుడితో ఫోన్‌లో మాట్లాడుతున్న నాగేందర్

మద్దూరు: 'హలో.. మై డీఎస్పీ బాత్ కర్‌హే హు అప్ కా బేటా డ్రగ్స్ కేస్ మే మిల్ గయా. ఛోడ్‌దేనా బోలేతో థీస్ హజార్ అర్జెంట్ ఫోపే కరో.. నైతో కేసు హోయాతో 10 సాల్ సజా గిర్‌తా, ఫైన్‌బీ గిర్‌తా.. అర్జెంట్ ఫోన్ పే కరో..(హలో నేను డీఎస్పీని.. నీ కొడుకు డ్రగ్ కేసులో పట్టుబడ్డాడు. అతడిని విడిచి పెట్టాలంటే వెంటనే రూ.30 వేలు ఫోన్ పే చేయండి. లేదంటే కేసు చేస్తే 10 ఏళ్ల జైలు శిక్ష, భారీ జరిమానా పడుతుంది) అంటూ వచ్చిన ఫోన్‌కాల్‌తో ఓ తల్లిదండ్రులు భయాందోళనకు గురయ్యారు. వివరాల్లోకి వెళితే మద్దూరు పట్టణానికి చెందిన నాగేందర్ పిండి గిర్నీ నడిపిస్తున్నాడు. ఇతని పెద్ద కొడుకు విశాల్ షాద్‌నగర్‌లోని ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. బుధవారం మధ్యాహ్నం 12.57 గంటలకు 923707509858 నెంబర్ నుంచి వాట్సప్ కాల్ వచ్చింది. దీంతో ఆయన భార్య భాగ్యమ్మ ఫోన్ ఎత్తింది. అవతలి వ్యక్తి హిందీలో మాట్లాడుతూ.. 'నీ కొడుకు మరో 4 గురు డ్రగ్స్ కేసులో పట్టుబడ్డారు. కేసు చేస్తే 10 ఏళ్ల జైలు శిక్షతో పాటు జరిమానా కూడా విధించడం జరుగుతుంది. మీ కుటుంబం ఎలాంటి కేసులో లేవు, ఉన్నతంగా జీవించే కుటుంబలా ఉంది. వెంటనే రూ.30 వేలు ఫోన్ పే చేస్తే కేసు నుంచి తప్పిస్తాం'అని తెలిపారు. ఆమె వెంటనే భర్త నాగేందర్‌కు ఫోన్ ఇచ్చింది. అవతలివైపు నుంచి దూరంగా పోలీసులు కొడుకును కొట్టుతున్న శబ్దాలను వినపడడంతో.. 'మా ఫోన్‌లో అంత డబ్బు లేదు.. మీరు ఎక్కడ ఉన్నారో చెబితే డబ్బులతో అక్కడి వస్తాం' అని భయపడుతూ చెప్పాడు. దీంతో అవతలి వ్యక్తి దంపతులను మరింత బెదిరించి, ఫోన్ కట్ చేశారు. విషయం చుట్టుపక్కల వారికి తెలియడంతో వారు ధైర్యం చెప్పే ప్రయత్నం చేశారు. ఫోన్ కట్ చేయడంతో మళ్లీ ఫోన్ చేశాడు. దాదాపు 10 నిమిషాల పాటు వీళ్లను ఫోన్‌లో బెదిరించాడు. ఈ క్రమంలో ఇతర ఫోన్ నుంచి అతని కొడుకు ఫోన్ చేసి యోగక్షేమాలు తెలుసుకున్నారు. నాకు ఏమీ కాలేదని కొడుకు చెప్పడంతో ఊపిరి పీల్చుకున్నారు. ఈ విషయాన్ని ఎస్ఐ విజయ్‌కుమార్ తెలుపగా నంబర్లను వాటప్స్ కాల్స్ వస్తే వెంటనే 1930 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేసి విషయం తెలియజేయాలని సూచించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో కూడా ఫిర్యాదు చేయాలని సూచించారు.

వైభవంగా రాములోరి కల్యాణం



రాములోరికి కల్యాణం చేస్తున్న అర్చకులు

ఎర్రవల్లి: శ్రీరాముడి జన్మ నక్షత్రం పునర్వసును పురస్కరించుకొని బీచుపల్లి పుణ్యక్షేత్రం కోదండరామస్వామి ఆలయంలో బుధవారం సీతా రాముల కల్యాణ వేడుక అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన అర్చకులు సీతారాములను అందంగా ముస్తాబు చేసి వేదమంత్రాల నడుమ వైభవంగా కల్యాణం జరిపించారు. వేడుకను తిలకించేందుకు భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి చేరుకున్నారు. భక్తులకు సంగాలకు చెందిన నల్లారెడ్డి కుటుంబ సభ్యులు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ మేనేజర్ సురేందర్‌రాజు, అర్చకులు భువనచంద్ర, దత్తుస్వామి, భానుమూర్తి, పాలక మండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఎంపీ క్లినిక్ సీజ్



గట్టు: మండలంలోని తుమ్మలచెరువుకు చెందిన పల్లెయ్య, చిట్టెమ్మ దంపతుల మూడో కుమార్తె సంజు(5) మృతికి కారణమైన ఆలూరులో ఆర్ఎంపీ నర్సింహ నిర్వహిస్తున్న క్లినిక్‌ను జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారులు సీజ్ చేశారు. ఆరోగ్య శాఖ అధికారులు డాక్టర్ ప్రసూనరాణి, డాక్టర్ కిరణ్మయి, మెడికల్ అధికారులు బుధవారం ఆలూరులో పర్యటించి క్లినిక్‌ను తనిఖీ చేసి సీజ్ చేసినట్లు తెలిపారు. పూర్తి వివరాలు.. ఆలూరులో ఆర్ఎంపీగా నర్సింహ క్లినిక్ నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో తుమ్మలచెరువుకు చెందిన బాలిక సంజు (5)కు తట్టు పోయడంతో పాటు జ్వరం రాగా, రెండు రోజుల క్రితం బాలికను క్లినిక్ తీసుకెళ్లారు. నర్సింహ హైపవర్ కలిగిన ఇంజక్షన్ ఇవ్వడంతో బాలిక పరిస్థితి మరింత విషమంగా మారింది. వెంటనే బాలికను కుటుంబ సభ్యులు కర్నూలు ఆస్పత్రికి తరలించగా అక్కడే చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. గ్రామంలో పంచాయతీ నిర్వహించిన అనంతరం బాలిక అంత్యక్రియలు బుధవారం నిర్వహించారు. బాలిక తల్లిదండ్రులకు కొంత మేరకు నష్టపరిహారం ఇచ్చేలా పెద్దలు పంచాయతీ నిర్వహించినట్లు గ్రామస్తులు తెలిపారు. ఘటన కలెక్టర్ బీఎం సంతోష్ దృష్టికి రాగా, ఆయన ఆదేశాల మేరకు జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారులు ఆలూరు చేరుకుని విచారణ చేపట్టి క్లినిక్‌ను సీజ్ చేశారు. ఆర్ఎంపీ నర్సింహపై చట్టపరంగా చర్యలు తీసుకోనున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో గుడిసె దగ్ధం

కేటీదొడ్డి: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో గుడిసె దగ్ధమైన ఘటన మండలంలోని ఎర్సన్‌దొడ్డి గ్రామంలో బుధవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలు.. గ్రామంలో జంబయ్యకు చెందిన గుడిసె షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగి దగ్ధమైంది. స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారమివ్వగా సిబ్బంది మంటలు అదుపులోకి తెచ్చారు. ప్రమాదంలో సుమారు రూ.2 లక్షల వరకు ఆస్తి నష్టం సంభవించినట్లు బాధితుడు పేర్కొన్నారు.

‘కురుమూర్తి’లో పూర్తయిన బహిరంగ వేలం

రూ.46 లక్షలు పలికిన లడ్డు ప్రసాదం



బహిరంగ వేలం నిర్వహిస్తున్న అధికారులు

చిన్నచింతకుంట: అమ్మాపురం కురుమూర్తిస్వామి బ్రహ్మోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించుకుందామని ఆలయ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, ఈఓ మదనేశ్వరెడ్డి అన్నారు. 2025–26 ఉత్సవాలకు సంబంధించి లడ్డు ప్రసాదం, కొబ్బరి కాయలు, లైటింగ్, తలనీలాలు, కొబ్బరి చిప్పలు, పూజ సామగ్రి తదితర వాటి బహిరంగ వేగం బుధవారం ఆలయ ఆవరణలో నిర్వహించారు. లడ్డు ప్రసాదంను చిన్నకడుమూర్‌కు చెందిన వెంకట్రాం రెడ్డి రూ.46 లక్షలకు, తలనీలాలను మహబుబ్‌నగర్‌కు చెందిన రామస్‌గౌడ్ రూ.32 లక్షలకు, విద్యుత్ లైటింగ్ అమ్మాపురం గ్రామానికి చెందిన రవితేజ రూ.13.33 లక్షలకు, రంగుల రాట్నం హైదరాబాద్‌కు చెందిన జ్ఞానేశ్వర్ రూ.34.05 లక్షలకు కొబ్బరి చిప్పలు అల్లీపురం గ్రామానికి చెందిన ఆంజనేయులు రూ.4,06,200కు దక్కించుకున్నట్లు వారు వివరించారు. పూజా సామగ్రి, కొబ్బరికాయల విక్రయానికి సరైన పాట రానందున వాయిదా వేసినట్లు చెప్పారు. ఉత్సవాలు అక్టోబర్‌లో జరగనున్నాయని.. లక్షలాది మంది భక్తులు హాజరు కానున్నందున ఎలాంటి ఇబ్బదులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు. పాటదారులు భక్తులకు నాణ్యమైన వాటిని విక్రయించాలని.. లేకుంటే తగిన చర్యలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, దేవరకద్ర మార్కెట్ కమిటీ చైర్మన్ కతలప్ప, ఆలయ కమిటీ సభ్యులు బాదం వెంకటేశ్వర్లు, భాస్కరాచారి, కమలాకర్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

జూరాలకు భారీగా వరద

- 2.92 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో.. 44 క్రస్ట్ గేట్లు ఎత్తి దిగువకు నీటి విడుదల
- కొనసాగుతున్న విద్యుదుత్పత్తి



జూరాల నుంచి దిగువకు పారుతున్న వరద

ధరూరు: మహారాష్ట్ర, కర్ణాటకలో కురుస్తున్న భారీ వర్షాలతో ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి భారీగా వరద వచ్చి చేరుతున్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. మంగళవారం 2.45 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. బుధవారం రాత్రి 7.30 ప్రాంతంలో 2.92 లక్షల క్యూసెక్కులకు పెరిగినట్లు వివరించారు. దీంతో ప్రాజెక్టు 44 క్రస్ట్ గేట్లు పైకెత్తి 3,22,179 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. విద్యుదుత్పత్తి నిమిత్తం 10,663 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 20, ఎడమ కాల్వకు 550 క్యూసెక్కులకు నీటిని విడుదల చేసినట్లు అధికారులు తెలిపారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 6.585 టీఎంసీలు ఉన్నట్లు చెప్పారు.

నిర్విరామంగా విద్యుదుత్పత్తి..

ఆత్మకూర్: జూరాల జలాశయానికి ఎగువ నుంచి భారీగా వరద చేరుతుండటంతో దిగువ, ఎగువ జల విద్యుత్ కేంద్రాల్లో ఉత్పత్తి వేగవంతంగా కొనసాగుతోంది. బుధవారం ఎగువ 6 యూనిట్ల నుంచి 234 మెగావాట్లు, 247.422 మి.యూ., దిగువ 6 యూనిట్ల నుంచి 240 మెగావాట్లు, 286.158 మి.యూ. విద్యుదుత్పత్తి చేపట్టామని ఎస్ఈ శ్రీధర్ వివరించారు. ఎగువ, దిగువ జలవిద్యుత్ కేంద్రాల్లో ఇప్పటి వరకు 533.580 మి.యూ. విజయవంతంగా చేపట్టామన్నారు.

రామన్‌పాడు నుంచి 15 వేల క్యూసెక్కులు..

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయానికి బుధవారం శంకరసముద్రం, సరళాసాగర్, ఊకచెట్టువాగు నుంచి వరద రావడంతో 7 గేట్లు ఎత్తి 15 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేసినట్లు ఏఈ వరప్రసాద్ తెలిపారు.

సరళాసాగర్ సైఫన్ల నుంచి..

మదనాపురం: సరళాసాగర్ జలాశయానికి ఎగువ నుంచి వరద వస్తుండటంతో బుధవారం రెండు ఉడ్ సైఫన్లు, రెండు ప్రైమరీ సైఫన్ల నుంచి 7,800 క్యూసెక్కుల నీరు దిగువకు వదిలారు. మదనాపురం వద్ద వాగు పారి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

కోయిల్‌సాగర్ జలాశయం వద్ద..

దేవరకద్ర: కోయిల్‌సాగర్ జలాశయానికి ఎగువ నుంచి భారీగా వరద రావడంతో బుధవారం ఉదయం 5 గేట్లను ఒక అడుగు మేర పైకెత్తి 4,500 క్యూసెక్కుల నీటిని వాగులోకి వదిలారు. మంగళవారం రెండు గేట్లను తెరవగా.. రాత్రి కురిసిన వర్షానికి జలాశయానికి భారీగా వరద చేరడంతో బుధవారం ఉదయం 5 గేట్లను తెరిచారు. సాయంత్రం నుంచి ఇన్‌ఫ్లో తగ్గడంతో రెండు గేట్లు, తర్వాత మరో గేటు మూసి వేశారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 32.6 అడుగులు కాగా.. ప్రస్తుతం 32 అడుగులు ఉంది.

నిండుకుండలా సుంకేసుల..

రాజోళి: సుంకేసుల జలాశయానికి వరద రోజురోజుకు పెరుగుతుండటంతో నిండుకుండను తలపిస్తోంది. బుధవారం ఎగువ నుంచి 1.45 లక్షల క్యూసెక్కుల వరద రాగా.. 19 గేట్లను రెండు మీటర్ల మేర, డ్యాంకు ఒక గేట్‌ను మీటర్ మేర తెరిచి 1,39,100 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలినట్లు జేఈ మహేంద్ర తెలిపారు. కేసీ కెనాల్‌కు విడుదల చేసిన 2,534 క్యూసెక్కులతో కలిపి డ్యాం నుంచి 1,41,634 క్యూసెక్కులు దిగువకు పారినట్లు చెప్పారు.

విద్యుత్‌ఘాతంతో ఎద్దులు మృత్యువాత



విద్యుదాఘాతంతో మృత్యువాత పడిన ఎద్దులు

కోడేరు: విద్యుదాఘాతంతో ఎద్దులు మృత్యువాత పడిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. మండలంలోని మాచుపల్లి గ్రామానికి చెందిన ఒగ్గు రాములు ఇంటి వద్ద పశువుల పాకలో ఎద్దులను కటేశాడు. ఉదయం 6 గంటల ప్రాంతంలో 11కేవీ విద్యుత్‌తీగలు తెగి ఎద్దులపై పడటంతో రెండు అక్కడికక్కడే మృత్యువాత పడ్డాయి. దాదాపు రూ.2లక్షల వరకు ఆస్తినష్టం ఏర్పడిందని బాధితుడు పేర్కొన్నాడు.

లభించని చిరుత ఆనవాళ్లు



చిరుత దాడిలో గాయపడిన నరేష్‌ను పరిశీలిస్తున్న అటవీ అధికారి

గండేడ్: వాహనదారుడిపై చిరుత దాడి చేసిన ప్రాంతాన్ని అటవీ శాఖ మహమ్మదాబాద్ రేంజ్ అధికారి అబ్దుల్‌హై ఆదేశాల మేరకు డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ రాఘవేందర్ బుధవారం పరిశీలించారు. మంగళవారం మండలంలోని లింగాయపల్లి గ్రామ సమీపంలో నరేష్ అనే వ్యక్తి బైక్‌పై వస్తుండగా చిరుత అకస్మాత్తుగా దాడి చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు బాధితుడు నరేష్ వద్దకు వెళ్లి విచారించి సంఘటన జరిగిన ప్రాంతానికి వచ్చి చిరుత ఎక్కడి నుంచి ఎక్కడికి వెళ్లిందని ఆరా తీశారు. బాధితుడు చింతగుట్ట వైపు వెళ్లినట్లు చెప్పడంతో అధికారులు పంట పొలాలతోపాటు ఖాళీ ప్రదేశాలను కలియ దిరిగారు. అయితే చిరుతకు సంబంధించి పాదముద్రలు ఏమీ లభించలేదని అటవీ అధికారి తెలిపారు. చిరుతకు సంబంధించి ఆనవాళ్లు ఏమీ లేకపోవడంతో దాడి చేసింది కచ్చితంగా చిరుత అని చెప్పలేమని పేర్కొన్నారు. అయినప్పటికీ సమీప గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.